ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
బుధవారం 27 నవంబరు 2024



3న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

పార్వతీపురం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిసెంబరు 3న జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహిస్తామని జిల్లా యువజన సర్వీసులశాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.రామగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ మేళా, జానపద నృత్యాలు, గీతాలు గ్రూప్/వ్యక్తిగతంగా పాల్గొనవచ్చునన్నారు. కవిత్వం, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, ఉపన్యాసం, ఫొటోగ్రఫీ వ్యక్తిగతంగా పోటీ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 8247554334 నెంబర్‌కు సంప్రదించవచ్చునన్నారు.


సాలూరు: మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

రాజ్యాంగం ● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

జాతికి మార్గ నిర్దేశం

సాలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం జాతికి మార్గ నిర్దేశమని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు, సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సాలూరు పట్టణం నాల్గో వార్డు పెద్దవీధిలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఆమె నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగం భారత రాజ్యాంగం అని అన్నారు. 'రాజ్యాంగ పీఠిక న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం తదితర అంశాలను ప్రస్తావించింది. ప్రజలు ఏ విధంగా ఉండాలి, వారి హక్కులు, విధులను రాజ్యాంగంలో స్పష్టంగా ఉన్నాయి. అంత గొప్ప రాజ్యాంగాన్ని దేశ ప్రజలకు అందించిన బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాత. కుల, మత, వర్గ, వర్ణ, విభేదాలు లేకుండా అందరం కలిసి స్వాతంత్ర్య ఫలాలను అనుభవించాలి. ముఖ్యంగా అట్టడుగు వర్గాల అభివృద్ధికి కృషి చేయాలి.' అని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, నాయకులు పాల్గొన్నారు.


పార్వతీపురంరూరల్: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

గిరిజనుడిపై కాల్పులు

● నాటు తుపాకీతో మూడు రౌండ్లు కాల్చిన దుండగుడు


విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న లక్కాయి

సీతంపేట రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో అలజడి రేగింది. ఓ గిరిజనుడిపై నాటు తుపాకీతో దుండగుడు మూడు రౌండ్లు కాల్పులకు తెగబడ్డాడు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన గిరిజనుడిని కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మండలంలోని దుగ్గి గ్రామానికి చెందిన బిడ్డిక లక్కాయి అనే గిరిజనుడు సోమవారం సాయంత్రం అడవి నుంచి మేకలు తోలుకొని ఇంటికి చేరుకున్నాడు. ఆరుబయట కొళాయి వద్ద స్నానం చేస్తుండగా ఆయనపై గుర్తు తెలియని వ్యక్తి నాటు తుపాకీతో మూడు రౌండ్లు కాల్పులు జరిపాడు. దీంతో అక్కడే కుప్పకూలి అపస్మారక స్థితిలోకి వెళ్లిన లక్కాయిని కుటుంబసభ్యులు హుటాహుటిన సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు, అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై దోనుబాయి ఎస్ఐ మస్తాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. మంగళవారం పాలకొండ డీఎస్పీ రాంబాబు.. దుగ్గి గ్రామాన్ని సందర్శించి గ్రామస్థుల నుంచి వివరాలను సేకరించారు. గ్రామంలో ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేశారు.

అభివృద్ధి పట్టదా?

● అధ్వానంగా ఐటీడీఏ పార్కు ● ధ్వంసమైన ఆట వస్తువులు
● గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం ● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు


శిథిలమైన జారుడు బల్ల

గరుగుబిల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని కుడి ప్రధాన కాలువ గట్టుకు అనుసరించి ఉన్న పార్వతీపురం ఐటీడీఏ పార్కు అధ్వానంగా తయారైంది. ఎటు చేసినా ధ్వంసమైన ఆట వస్తువులు, పిచ్చిమొక్కలే దర్శనమిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఈ పార్కును తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల పాలనలో పార్కు అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. దీంతో ఇక్కడ ఆహ్లాదం కరువవడంతో పర్యాటకుల సంఖ్య తగ్గిపోయింది. ఫలితంగా పార్కు ఆదరణ కోల్పోతుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లక్ష్మీషా కృషి మేరకు తోటపల్లి కుడి ప్రధాన కాలువ గట్టుకు ఆనించి పార్కు ఏర్పాటు చేశారు. 2017 డిసెంబరులో పార్కును ప్రారంభించారు. లక్ష్మీషా పీవోగా ఉన్న సమయంలో పార్కు నిర్వహణకు అవసరమైన నిధులు మంజూరు చేశారు. ఆయన బదిలీపై వెళ్లిన తరువాత పార్కును పట్టించుకునే వారు కరువయ్యారు. అప్పటి నుంచి ప్రాజెక్టు అధికారులు పరిశీలనకే పరిమితమయ్యారు తప్ప అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేదు.

నేలకొరిగిన ట్రాంపొలిన్




పార్వతీపురం ఐటీడీఏ పార్కు

అసంపూర్తిగా నిర్మాణాలు

పార్కు వద్ద క్యాంటీన్ల నిర్వహణకు గతంలో అవసరమైన పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచాయి. పిచ్చి మొక్కల నడుమ అసౌకర్యంగా దర్శనమిస్తున్నాయి. ఐటీడీఏ పరిధిలో ఒక అధికారి చేసిన పనులు మరో అధికారి చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. పార్కు నిర్వహణతో పాటు బోటు షికారు అభివృద్ధికి కొంతమంది ఐటీడీఏ సిబ్బంది ఆటంకం కల్పిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అభివృద్ధికి ప్రతిపాదనలు చేసినా అడ్డు తగులుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం స్పందించి ఈ సంక్రాంతికైనా పార్కును అభివృద్ధి చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.


పిచ్చి మొక్కల నడుమ క్యాంటీన్ నిర్మాణాలు

కళావిహీనం..

ఒకప్పుడు పర్యాటకులతో కళకళలాడే పార్కు ఇప్పుడు కళావిహీనంగా మారింది. గతంలో సెలవు రోజుల్లో అధిక సంఖ్యలో పర్యాటకులతో ఇక్కడ సందడి నెలకొనేది. ప్రస్తుతం సౌకర్యాలు లేమితో సందడి తగ్గింది. ప్రస్తుత కార్తీకమాసంలో అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చే పరిస్థితి ఉన్నా అసౌకర్యాలే దర్శనమిస్తున్నాయి. చిన్నారులు ఆడుకొనే ట్రాంపొలిన్ ఛైన్సీలు మూలకు చేరాయి. ఊయల బల్లలు, జారుడు బల్లలు, గిరి కళావేదిక స్టేజీ శిథిలావస్థకు చేరుకున్నాయి. విద్యుత్ దీపాలు లేక రాత్రుళ్లు అంధకారం నెలకొంటుంది. గతంలో పార్కులోకి ప్రవేశానికి రూ. 5 నుంచి రూ. 10 వరకు వసూలు చేసేవారు. ఆదివారం, పండగలు వంటి సెలవు రోజుల్లో రూ. 10 వేలుకు పైబడి వసూలు అయ్యేది. ప్రస్తుతం రూ. 10 నుంచి రూ.20 వరకు పెంచారు. కానీ, సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. గతంలో ఇక్కడ నలుగురు సిబ్బంది విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం ఇద్దరే పని చేస్తున్నారు. వీరికి నెలకు రూ.7,500 చెల్లించాల్సి ఉంది. కానీ, మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అయినా, సొంతంగా డబ్బులు ఖర్చుచేసి పలు పనులు నిర్వహిస్తున్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రణాళికలు సిద్ధం చేశాం

ఐటీడీఏ పార్కు అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేశాం. పూర్తిస్థాయిలో అభివృద్ధికి పీవో దృష్టి సారిస్తున్నారు. అవసరమైన నిధులు కేటాయించనున్నారు. పార్కుతో పాటు పరిసర ప్రాంతాల్లో కుటీరాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. 15 రోజుల్లో పనులు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.

-తిరుపతిరావు, ఐటీడీఏ పార్కు ఇన్‌చార్జి, పార్వతీపురం

ప్రజా వ్యతిరేక విధానాలు ఖండిద్దాం

● వామపక్షాలు, ప్రజా సంఘాల ర్యాలీ

బెలగాం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఒక్కరూ ఖండించాలని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకురాలు పి.ఝాన్సీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ రైతులు, కార్మికుల సమస్యలను విస్మరిస్తుందని ఆరోపించారు. 'కార్మిక చట్టాలను రద్దు చేసి వారి హక్కులను కాలరాస్తుంది. వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చి, కార్పొరేట్లకు అనుకూలంగా మరో రూపంలో అమలుకు పూనుకుంటుంది. ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ శక్తులకు విక్రయిస్తుంది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వడం లేదు. ఉద్యోగ భద్రత కల్పించడం లేదు. 8 గంటల పని విధానం పోయి 12 గంటల పని విధానం అమలు చేస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యవసాయ మోటార్లకు ఏర్పాటు చేయడం తగదు. ట్రూ అప్, ప్రీపెయిడ్ చార్జీల పేరుతో రూ.17 వేల కోట్లు భారం వేసి వసూలుకు పూనుకుంది. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి. కనీస వేతనం అమలు చేయాలి. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలు మాఫీ చేయాలి' అని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వామ పక్ష, ఏపీ రైతు వ్యవసాయ, కార్మిక, గిరిజన, ట్రేడ్ యూనియన్ నేతలు బంటు దాసు, శ్రీను నాయుడు, రమణి, భాష, బుడితి అప్పల నాయుడు, జీవ, సూరయ్య, కుమార్, రెడ్డి వేణు, సూరిబాబు, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

ఉడుమును చంపి.. వీడియో తీసి..

● యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన యువకులు
● ఇద్దరిని అరెస్టు చేసిన అటవీశాఖ అధికారులు


ఉడుమును చంపి చూపిస్తున్న యువకులు(ఫైల్)

పార్వతీపురం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకులు ఓ ఉడుమును పట్టుకుని చంపారు. దీని మాంసం తింటే ఆరోగ్యానికి మంచిదంటూ వీడియో తీసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ వీడియో చూసిన ఓ జంతు సంరక్షణ సంస్థ అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆ ఇద్దరు యువకులను అధికారులు అరెస్టు చేశారు. ఈ వివరాలను మంగళవారం పార్వతీపురం రేంజర్ బిల్లంగి రామనరేష్ విలేకరులకు వెల్లడించారు. పార్వతీపురం మండలం పెదమరికి పంచాయతీ బండిదొరవలస గ్రామానికి చెందిన చీమల నాగేశ్వరరావు, ఎలకల నానిబాబు అనే ఇద్దరు యువకులు ఇటీవల తమ గ్రామ సమీప పొలాల్లో ఉడుమును వేటాడారు. దీని మాసం తింటే నడుం నొప్పి పోతుందని ఫోన్‌లో వీడియో తీసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. అనంతరం ఉడుమును వండుకుని తిన్నారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనిపై స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో అటవీశాఖ ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 25న రాత్రి నాగేశ్వరరావు, నానిబాబును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచ్చారు. నాగేశ్వరరావు గ్రామ సచివాలయ లైన్‌మన్‌గా పార్వతీపురం మండలం లక్ష్మీనారాయణపురంలో పనిచేస్తున్నారు. వన్యప్రాణులను వేటాడడం నేరమని, ఇటువంటి ఘటనలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని రేంజర్ రామనరేష్ హెచ్చరించారు. వన్య ప్రాణులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొండ సబ్ డీఎఫ్‌వో వై.సంజయ్, పార్వతీపురం ఫారెస్ట్ అధికారి మనోజ్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న రేంజర్ రామనరేష్

కన్నపుదొరవలసలో జ్వరాల విజృంభణ

● 17 మందికిపైగా పీడితులు ● ఆరుగురికి డెంగ్యుగా అనుమానం ● కానరాని వైద్య శిబిరం

జియ్యమ్మవలస, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నపుదొరవలస పంచాయతీలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. గత 15 రోజులుగా జ్వరాలు పట్టిపీడిస్తుండడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన గుంట్రెడ్డి జయదేవ్, బంకురు లక్ష్మి, గొర్లి చింతల్లి, దత్తి సింహాచలంతో పాటు మరో 13 మంది జ్వరాలతో బాధపడుతున్నారు. వీరిలో కొందరు ఇంటి వద్ద, మరికొందరు చినమేరంగి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. లక్ష్మి, చింతల్లి, సింహాచలంతో పాటు మరో ముగ్గురికి డెంగ్యూగా వైద్యులు అనుమానిస్తున్నారు. కాగా, రెండు వారాలుగా గ్రామంలో జ్వరాలు ప్రబలుతున్నా అధికారులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి ఆనుకుని ఉన్న చెరువులో ఎక్కువ వ్యర్థాలు వేస్తున్నారని, దీంతో నీరు కలుషితమై దోమలకు ఆవాసం మారిందని చెబుతున్నారు. దీనివల్ల గ్రామంలో జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మాదలింగి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి కొందరి జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించి వెళ్లినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. జ్వరాలు ఉధృతం కాకముందే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


చినమేరంగి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

ఉమా పాట.. కుర్రకారు ఆట

● ఫోక్ సింగర్‌గా రాణిస్తున్న నవగాం యువకుడు
● 'నాయుడంటే నాయుడు కాదు' పాటకు యూట్యూబ్‌లో మిలియన్ల లైక్‌లు

6లో






ఉదయాన మంచు దుప్పట్లో...

జాతీయ రహదారిపై రాత్రివేళల్లో దట్టంగా కురుస్తున్న మంచు

మంచు కురిసే వేళ..

సాయంత్రం, ఉదయం వేళల్లో పరిసరాలన్నీ తెల్లదనాన్ని అద్దుకుంటున్నాయి. మంచుతో తడిసిపోతున్నాయి. రహదారులు తేమతో కూలైపోతున్నాయి. ఆ రోడ్లపై ఉన్న దీపాల వెలుగుల్లో కమ్మనైన మంచు దృశ్యాలు ఆవిష్కృతమై కనువిందు చేస్తున్నాయి. పొలాలు, చెట్లు, కొండలు మంచు దుప్పట్లో మునుగుతున్నాయి. మంచుకు చలి తోడై మరింత వణికిస్తోంది. ఉదయం 8 గంటలైనా చలి తీవ్రత తగ్గడం లేదు. మంచు వీడడం లేదు.

- విజయనగరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి)

గుంతల ఇక్కట్లకు చెక్!

- జిల్లాలో రెండు ప్రధాన రోడ్లకు మోక్షం
- విజయనగరం-పాలకొండ రహదారి అభివృద్ధి
- చిలకపాలెం-రాజాం- రాయగడ కూడా..
- పీపీపీ పద్ధతిలో నిర్మాణానికి శ్రీకారం
- కూటమి ప్రభుత్వంపై ప్రజల హర్షాతిరేకాలు



విజయనగరం-పాలకొండ రహదారిలోని రాజాం వద్ద రోడ్డు పరిస్థితి ఇది. ఓ గోతిలో ఇలా వ్యాను దిగబడింది. దీంతో వ్యానును బయటకు తీసేందుకు పోలీసులు, డ్రైవరు పడిన అవస్థలు అన్నీఇన్నీ కావు. ఇక్కడ ప్రమాదకర స్థితిలో డ్రైవింగ్ చేయాల్సి వచ్చింది. బలంగా ముందుకు తీసుకెళ్లే క్రమంలో ఏకంగా ఇంజన్ పైకి లేచింది. ఏమాత్రం అదుపు తప్పినా ఇంజన్ ఫల్టీ కొట్టడం తథ్యం. ఈ దృశ్యం రెండేళ్ల కిందటిది. కానీ అక్కడ ఇప్పటికీ అదే పరిస్థితి ఉంది.



రాజాంలోని డోలపేట సమీపంలో ఇలా గోతుల్లో ఓ ఆటో దిగబడింది. ప్రయాణికులతో వంగర మండలం నుంచి వచ్చిన ఆటో గుంతలో దిగబడిపోవడంతో డ్రైవర్ ఆపసోపాలు పడాల్సి వచ్చింది. ముందుకు తీసుకెళ్లే క్రమంలో ఆటో యాక్సిల్ విరిగిపోయింది. దీంతో రూ.3 వేల వరకూ ఖర్చు పెట్టి దాన్ని బాగుచేసుకోవాల్సి వచ్చింది.



రాజాం-పాలకొండ రోడ్డు దుస్థితి

రాజాం/రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇలాంటివి రాజాం పట్టణంలో నిత్యకృత్యం. విద్య, వైద్య, వాణిజ్యపరంగా పట్టణం విస్తరించింది. ఎంతో అభివృద్ధి చెందింది. ఇక్కడ రహదారులు చూస్తే మాత్రం దారుణంగా ఉన్నాయి. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్ల నిర్వహణ గాలికొదిలేయడంతో పూర్తిగా పాడయ్యాయి. విజయనగరం నుంచి పాలకొండ వరకూ రోడ్డు 72.55 కిలోమీటర్ల మేర ఉంది. ఇది దారి పొడవునా గోతులమయంగా మారింది. కానీ రాజాం పట్టణం వద్దకు వచ్చేసరికి పూర్తిగా స్వరూపమే మారిపోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు ఈ రోడ్డుపై దృష్టిపెట్టింది. పీపీపీ పద్ధతిలో రోడ్డు నిర్మాణంతో పాటు నిర్వహణకు ముందుకొచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 18 రహదారులను ఎంపిక చేయగా.. అందులో జిల్లాకు చెందిన రెండు రహదారులు ఉండడం విశేషం. రాష్ట్రంలో 18 రహదారులను 1307 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు. ఇందులో విజయనగరం-పాలకొండ రహదారితో పాటు చిలకపాలెం-రాజాం-రాయగడ రహదారి మరొకటి. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ముందుగా ఈ రోడ్లలో ఎంత ట్రాఫిక్? మున్ముందు ఎంత పెరిగే అవకాశం ఉంది? వంటివి అధ్యయనం చేయనున్నారు. ఇందుకు అనుగుణంగా రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించనున్నారు. అయితే ఈ రహదారుల నిర్మాణానికి సంబంధించి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించనున్నారు. జాతీయ రహదారులపై మాదిరిగా టోల్ ప్లాజాలను ఏర్పాటుచేసి వాహనదారుల నుంచి వసూలు చేస్తారు.

జిల్లాలో ప్రధాన రహదారి

జిల్లాలో ప్రధానంగా విజయనగరం-పాలకొండ రహదారి ఉంది. విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలను కలుపుతూ ఉంటుంది. శ్రీకాకుళం జిల్లా మీదుగా ఒడిశాకు కలుపుతూ సాగుతోంది. ముఖ్యంగా విజయనగరం నుంచి పాలకొండ వరకూ 72.55 కిలోమీటర్ల మేర రహదారిని బాగుచేస్తే రవాణా కష్టాలు తీరుతాయి. ఇదే రోడ్డులో నెల్లిమర్ల, గరివిడి, చీపురుపల్లి, రాజాం, పాలకొండ పట్టణాల్లో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. దీనికితోడు రోడ్డు ధ్వంసం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి. ముఖ్యంగా రాజాం నుంచి పాలకొండ వరకూ ఉన్న రహదారి దారుణంగా తయారైంది. రాజాం పట్టణంలో అయితే రోడ్లు నరకం చూపిస్తున్నాయి. ఇప్పుడు అధికారులు ఎనిమిది చోట్ల డబుల్ లేన్ రోడ్లు, ఆరుచోట్ల అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రతిపాదించారు.

గత ఐదేళ్లుగా నిర్లక్ష్యం

ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో రహదారుల్ని గాలికొదిలేశారు. కొత్తగా రహదారుల నిర్మాణం మాటలా ఉంచితే.. గుంతల రోడ్ల మరమ్మతులనూ పట్టించుకోలేదు. 2014-19 మధ్య తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు వేసిన బీటీ రహదారులకు కనీసం మరమ్మతులు చేయించలేదు. ఎక్కడికక్కడ గోతులతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రాజాం-శ్రీకాకుళం రహదారిలో వీఆర్ అగ్రహారం జంక్షన్ నుంచి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం పెంట గ్రామం వరకూ ఏడు కిలోమీటర్ల మేర బీటీ రహదారి, గ్రామాలలో సిమెంటు రోడ్లు అధ్వానంగా మారాయి. పొగిరి జంక్షన్ నుంచి బొడ్డవలస వరకూ నిర్మించిన బీటీ రహదారిదీ ఇదే పరిస్థితి. రాజాం-విజయనగరం మార్గంలోని కొత్తవలస జంక్షన్ నుంచి మారేడుబాక, ఇల్లంనాయుడు వలస మీదుగా నిర్మించిన రింగ్‌రోడుతో పాటు గార్రాజు చీపురుపల్లి జంక్షన్ నుంచి బొమ్మినాయుడు వలస, ముద్దాడ జోగివలస గ్రామాల మీదుగా రాజాం-బొబ్బిలి రోడ్‌ను కలిపే రింగురోడ్డు సైతం మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. రాజాం- విజయనగరం మార్గంలో బొద్దాం ఉన్నత పాఠశాల జంక్షన్ నుంచి సోపేరు, రాజాం-పాలకొండ రోడ్‌లో డోలపేట నుంచి గడిముడిదాం, అమరాం, దోసరి మార్గాలలో నడకా నరకంగానే మారింది. రాజాం పట్టణం కేంద్రంగా శ్యాంపురం, నందబలగ, లక్ష్మీపురం, కొఠారిపురం మీదుగా రాజాం-విజయనగరం రోడ్‌ను కలిపే రింగురోడ్డు సైతం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. ఆయా ప్రాంతాల స్థానికులు మట్టితో గోతుల్ని కప్పుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే మున్సిపాలిటి పరిధిలోని కొండంపేట నుంచి బుచ్చెంపేట వరకూ వీర్రాజు చెరువుగట్టు పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. కాగా 2016లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రహదారులను బాగుచేసేందుకు టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇంతలో అధికారం మారడంతో అది మరుగున పడిపోయింది. అయితే ఇటీవల రహదారుల నిర్మాణంపై కూటమి పాలకులు దృష్టిపెట్టారు చంద్రబాబు. నిధుల కొరత కారణంగా పీపీపీ విధానంలో బాగుచేసేందుకు నిర్ణయించారు. దీన్ని జిల్లా ప్రజలు స్వాగతిస్తున్నారు. వీలైనంత త్వరగా రోడ్ల నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరుతున్నారు.

అంతర్ రాష్ట్ర రహదారి

జిల్లాలో మరో రహదారికి సైతం మోక్షం కలిగింది. చిలకపాలెం-రాజాం-రామభద్రపురం -రాయగడకు 130.40 కిలోమీటర్ల దూరం ఉంటుంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు ఒడిశా ప్రజలు వేలాది మంది ప్రయాణం సాగిస్తుంటారు. గత కొన్నేళ్లుగా ఈ రోడ్డు నిర్వహణ లేదు. దీంతో ఎదురయ్యే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఇప్పుడు ఈ రోడ్డును సైతం అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పించడం శుభ పరిణామం.

నరకం చూస్తున్నాం..

రహదారులతో నరకం చూస్తున్నాం. వాహనాలు సైతం మరమ్మతులకు గురవుతున్నాయి. గత ఐదేళ్లలో రాజాంలోని రహదారులను విడిచి పెట్టేశారు. దీంతో ఎక్కడికక్కడే గోతులుమయంగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో వాహనమిత్ర అందించినా.. ఫలితం లేకపో యింది. అంతకు మించి ఆటోల మరమ్మతులకు ఖర్చయ్యేది.

- సత్యం, ఆటోడ్రైవర్, రాజాం

రోడ్డుపైకి రావాలంటే భయం

రోడ్డుపైకి రావాలంటే భయం వేసింది. రాజాం పట్టణ రహదారులు అలానే ఉన్నాయి. పోనీ ఇటు పాలకొండ వెళదామన్నా, అటు విజయనగరం వెళ్లాలన్నా రోడ్డు దారుణంగా ఉండేది. వాహనాలను బయటకు తీయాలంటే ఆందోళన కనిపించేది. ఎలాగైనా పర్వాలేదు కానీ రోడ్డు బాగుచేసి అందుబాటులోకి తేవాలి.

- శ్రీను, స్థానికుడు, రాజాం

శుభ పరిణామం

పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయడానికి జిల్లాలో రెండు రహదారులు ఎంపిక కావడం శుభ పరిణామం. వీటితో జిల్లాకు కొంతవరకూ కష్టాలు తీరుతాయి. రాష్ట్రంలో 18 రోడ్లను ఎంపిక చేయగా.. ఇందులో మన జిల్లావే రెండు ఉన్నాయి.

- కె.విజయరత్నం, ఎస్ఈ, రోడ్లు భవనాల శాఖ, విజయనగరం

ఉమా పాట.. కుర్రకారు ఆట

- ఫోక్ సింగర్‌గా రాణిస్తున్న నవగాం యువకుడు
- 'నాయుడంటే నాయుడు కాదు' పాటకు యూట్యూబ్‌లో మిలియన్ల లైక్‌లు

జియ్యమ్మవలస, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పాలకొండ మండలం నవగాం గ్రామానికి చెందిన లావేటి ఉమామహేశ్వరరావు (ఉమా) అనే యువకుడు ఫోక్ సింగర్‌గా రాణిస్తున్నాడు. ఆయన పాటలు యువతను ఉర్రూత లూగిస్తున్నాయి. ఉమా వాయిస్‌కు యువత ఫిదా అవుతున్నారు. లావేటి చంద్రంనాయుడు, కరుణ దంపతుల రెండో కుమారుడు ఉమామహేశ్వరరావు. 1995 నవంబరు 13న జన్మించాడు. పదో తరగతి వరకు పాలకొండలో చదివాడు. విజయనగరం జిల్లా తాండ్రపాపారాయ కాలేజీలో పాలిటెక్నిక్ సివిల్ ఇంజనీరింగ్ డిప్లమోను పూర్తి చేశాడు. నోవా ఇంజనీరింగ్ కాలేజీ (విజయవాడ)లో బీటెక్ చదివాడు. ఉమామహేశ్వరరావుకు చిన్నప్పటి నుంచి పాటలు పాడటం అంటే ఎంతో ఇష్టం. ఆ ఇష్టమే ఇప్పుడు ఫోక్ సింగర్‌ని చేసింది. రేలారే రేలా గాయకుడు రఘు ప్రోత్సా హంతో ఫోక్‌కు మరింత పదును పెట్టా డు. ఆయన స్ఫూర్తితో, ప్రోత్సాహం తోనే ఫోక్ సింగింగ్‌లో మరింత రాణించగలుగుతున్నానని ఉమామహేశ్వరరావు చెబుతున్నాడు. ఇంతవరకు తాను 'ఓ పిల్లా.. మరదల పిల్లా', 'వినాయక.. ఓ వినాయక', 'బీటెక్ పిల్లరా.. బావ మరిది', 'పాలకొండలోన పిల్ల బాగున్నాది', 'పాలకొండ వెళ్లి.. పాల కూర తెచ్చాను', 'నాయుడంటే నాయుడు కాదు.. నాయుడేడమ్మో' పాటలు పాడినట్లు తెలిపాడు. ఇవి కాకుండా కొన్ని దేవుని పాటలు కూడా పాడాడు. అతి తక్కువ కాలంలో మంచి గుర్తింపు తెచ్చిన ఫోక్ పాటలు మాత్రం 'నాయుడంటే నాయు డు కాదు.. నాయుడేడమ్మో', 'పాలకొండలోన పిల్ల బాగు న్నాది'. ఈ రెండు పాటలు కుర్రకారు ఉర్రూత లూగిం చాయి. 'నాయుడంటే నాయుడు కాదు, నాయుడేడమ్మా' పాట యూట్యూబ్‌ను షేక్ చేస్తోంది. మిలియన్ల కొద్ది లైక్‌లు వచ్చాయి. తన లక్ష్యం సమాజంలో మంచి గుర్తింపు పొందడమేనని ఉమామహేశ్వరావు తెలిపాడు.



రఘుతో కలిసి 'నాయుడంటే నాయుడు కాదు..' పాట పాడుతున్న ఉమామహేశ్వర రావు

ఎండు పండు.. ఆరోగ్యం మెండు!



- పెరిగిన డ్రై ఫ్రూట్స్ వినియోగం
- ప్రజల్లో ఆరోగ్యంపై పెరుగుతున్న శ్రద్ధ

రాజాం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన విధానంలో అందులోనూ ఆరోగ్యకర ఆహారం తీసుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ కనిపిస్తోంది. చెప్పుకోదగ్గ మార్పు వస్తోంది. అనారో గ్యం కలగకుండా అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో పోషక విలువలున్న డ్రైఫూట్స్‌ను తీసుకుంటే... రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం... ఉంటుందనేది మెజారిటీ ప్రజల అభిప్రాయం. కాస్త ధర ఉన్నా చిన్న చిన్న ప్యాకెట్లలో కూడా అందుబాటులో ఉన్నాయి. మనిషి ఆరోగ్యానికి మేలుచేసే కొన్ని డ్రైఫ్రూట్స్ గురించి తెలుసుకుందాం. వైద్యులు కూడా డ్రై ఫ్రూట్స్ తీసుకోవాలని సూచిస్తున్నారు.

అంజీర



- హైపర్ టెన్షన్‌ను తగ్గిస్తుంది. సెక్సువల్ డిసార్డర్స్‌ను సరిచేస్తుంది.
- శుక్రకణాలను అభివృద్ధి చేస్తుంది. ఆస్తమా నుంచి ఉపశమనం. కంటిచూపును రక్షిస్తుంది.

ఖర్జూరం



- కొవ్వును తగ్గిస్తుంది. కండరాలను బలంగా చేస్తుంది. తక్షణశక్తిని ఇస్తుంది.
- ఎముకలను దృఢంగా ఉంచుతుంది. అలసటను దూరంగా ఉంచుతుంది.

ఆప్రికాట్..

- నర్వస్ సిస్టమ్‌ను డెవలప్ చేస్తుంది. స్కిన్ క్యాన్సర్ రాకుండా కాపాడుతుంది.
- ఎముకలను, గుండెను, జీర్ణక్రియను సమర్థవంతంగా కాపాడుతుంది.
- చర్మ సౌందర్యానికి, కళ్లకు ఎంతో గొప్పగా పనిచేస్తుంది.

పిస్తా..



- రక్తాన్ని పెంపొందిస్తుంది. చర్మ సౌందర్యానికి, కళ్లకు ఎంతో గొప్పగా పనిచేస్తుంది. వ్యాధి నిరోధకశక్తిని పెంచుతుంది.
- ఊబకాయాన్ని తగ్గిస్తుంది. జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది.

వాల్‌నట్



- బరువు తగ్గటకు సహకరిస్తుంది. శుక్రకణాలను అభివృద్ధి చేస్తుంది.
- హార్ట్‌ఎటాక్ రిస్క్‌ను తగ్గిస్తుంది. బ్లడ్ లెవెల్స్‌ను పెంచుతుంది. టైప్ 2 మధుమేహాన్ని తగ్గిస్తుంది.

కిస్‌మిస్..



- హైపర్‌టెన్షన్‌ను తగ్గిస్తుంది. క్యాన్సర్ రిస్క్‌ను తగ్గిస్తుంది.
- జ్వరం, జలుబు వంటి వాటి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. పళ్లను బలంగా ఉంచుతుంది.

జీడిపప్పు

- రక్తపోటు, క్యాన్సర్ రిస్క్‌ను తగ్గిస్తుంది.
- ఇన్ఫెక్షన్‌తో పోరాడుతుంది. ఎర్ర రక్తకణాలను పెంపొందిస్తుంది.
- కిడ్నీలో రాళ్ల ఏర్పడటాన్ని తగ్గిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.

బాదంపప్పు

- బరువు తగ్గడానికి సహకరిస్తుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.
- హార్ట్‌ఎటాక్ రిస్క్‌ను తగ్గిస్తుంది. బ్లడ్ లెవెల్స్‌ను పెంచుతుంది.
- టైప్ 2 సుగర్‌ను తగ్గిస్తుంది.

ఇవేకాకుండా..

వీటితో పాటు ఆరోగ్య పరిరక్షణలో ఎండుద్రాక్ష, ఎండు ఖర్జూరం, నల్ల ద్రాక్ష, చెర్రీస్, బ్రెజల్‌నట్, పెకాన్, మెకడామియ, హాజల్‌నట్, పైన్‌నట్, బెర్రీస్, గోజీ బెర్రీ, ప్రన్స్, డీ హైడ్రేటెడ్ కివి, డీ హైడ్రేటెడ్ పైనాపిల్, డీ హైడ్రేటెడ్ లెమన్, డీ హైడ్రేటెడ్ ఆపిల్ కీలకపాత్ర పోషిస్తున్నాయి. వీటితో పాటు గుమ్మడి, పొద్దుతిరుగుడు, అవిశ, వాటర్‌మిలాన్, చియా విత్తనాల వినియోగం బాగా పెరిగింది.

ఆరోగ్యరక్షణ అవసరం



మారుతున్న పరిస్థితు లకు అనుగుణంగా ఆరో గ్యంలో కూడా పెను మార్పులు సంభవి స్తున్నాయి. ఎవరి ఆరోగ్యా న్ని వారే పరి రక్షించుకోవాలి. ఇందుకోసం మిల్లెట్స్‌తో పాటు డ్రైఫ్రూట్స్ తీసుకుంటే మేలు. ప్రస్తుతం సామా న్యుడికి కూడా డ్రైఫ్రూట్స్ అందుబాటులోకి వచ్చాయి.

- పీఎల్ఎన్ రాజు, వైద్యుడు, రాజాం

న్యూస్ బాక్స్

29న జాబ్‌మేళా

చీపురుపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న చీపురుపల్లి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ కృష్ణాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల వయసు ఉన్న పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు మేళాలో పాల్గొనవచ్చునన్నారు. అరబిందో ఫార్మా, డక్కన్ ఫైన్ కెమికల్స్ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్సు సంస్థలు హాజరవుతున్నాయన్నారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ

విజయనగరం రింగురోడ్డు/టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22, 23న ఏయూలో నిర్వహించిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో విజయనగరం మహారాజా అటానమస్ కళాశాల మహిళలు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించినట్టు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం సాంబశివరావు తెలిపారు. ఈ విద్యార్థినులను మంగళవారం ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

రెల్లరాల్చు పురుగుపై అవగాహన

లక్కవరపుకోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరి పంటకు ఆశిస్తున్న రెల్ల రాల్చు పురుగుపై మంగళవారం వ్యవసాయ అధికారి స్వాతి రైతులకు అవగాహన కల్పించారు. మార్లాపల్లి, చందులూరు గ్రామ రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ పురుగు నివారణకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

రిజిస్ట్రేషన్ చేయండి

శృంగవరపుకోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామ భూములకు రిజిస్ట్రేషన్లు చేయాలని వీరనారాయణానికి చెందిన రైతు కిలపర్తి జగదీష్ స్థానిక సబ్ రిజిస్ట్రార్‌ను కోరారు. మంగళవారం ఈ మేరకు వినతిపత్రం అందించారు. వీరనారాయణం గ్రామానికి చెందిన భూములను చాలా రోజులుగా రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులు పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. దీని వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

బోరు బాగుచేయించరూ

జామి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాగరం గ్రామంలో రామజోగి కళ్లాలు వద్ద చేతిపంపు పాడైందని, మండల అధికారులకు చెప్పినా ప్రయోజనం కనిపించడం లేదని గ్రామస్థులు తెలిపారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పార్వతి వివరణ కోరగా తమ సిబ్బందిని బాగుచేయడానికి పంపించామని చెప్పారు. పంచాయతీ వారు రిపేర్‌కు అవసరమైన సామాన్లు ఎంపీడీవో కార్యాలయం నుంచి తెప్పించలేదని తెలిపారు.

టీడీపీ అధ్యక్షుడిని కలిసిన డైరెక్టర్

విజయనగరం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమితులైన ప్రసాదుల ప్రసాద్ మంగళవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజులను విశాఖపట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కలిశారు.

వెన్నెకు సత్కారం

గుర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ డైరెక్టర్‌గా నియమితులైన వెన్నె సన్యాసి నాయుడును ఉత్తరాంధ్ర విద్యార్థిసేన, తెలుగుదేశం పార్టీ విభాగాల తరపున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుంకరి రమణమూర్తి, కనిమెరక కృష్ణ, పున్నపురెడ్డి శ్రీను, గేదెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంక్షేమమే లక్ష్యం

రాజాం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సంక్షేమానికి, విద్యారంగ పటిష్టతకు కృషి చేస్తున్నట్లు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు పాకలపాటి రఘువర్మ స్పష్టం చేశారు. పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఉపాధ్యాయులకు నెలవారీ ప్రమోషన్లను తిరిగి పునరుద్ధరించేందుకు వీలుగా చర్యలు ప్రారంభించామని పేర్కొన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్‌మోహన్, నాయకులు రౌతు గణపతిరావు నాయుడు, బొడ్డేపల్లి రాజేశ్వరి, స్వరూపరాణి పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలను సందర్శించిన కలెక్టర్

నెల్లిమర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మంగళవారం సందర్శించారు. ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ, సిబ్బందితో మాట్లాడారు. తరగతి గదులను, భవనాలను పరిశీలించారు. సమస్యలను తెలుసుకున్నారు. అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని ప్రిన్సిపాల్ సత్యనారాయణ అభ్యర్థించడంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

ముమ్మరంగా పశుగణన

కొత్తవలస, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విజయనగరం డివిజన్‌లోని 19 మండలాలలో ముమ్మరంగా పశుగణన కార్యక్రమం జరుగుతోందని పశు సంవర్థక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ ఎస్.దామోదరరావు తెలిపారు. మంగళవారం ఆయన వివిధ రైతు సేవాకేంద్రాలను పరిశీలించారు. అనంతరం కొత్తవలసలోని కార్యాలయంలో ఏడీ గంగాధరరావుతో కలసి విలేకరులతో మాట్లాడారు. 2025 ఫిబ్రవరి 28వరకు పశుగణన జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 44 వేల 721 ఇళ్లలో పశుగణన పూర్తయిందన్నారు

అధికారుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం: మంత్రి


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్

గంట్యాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు సహకరించాలని రాష్ట మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. మంగళవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ శాఖల వారీగా ప్రగతి, చేపడుతున్న కార్యక్రమాల వివరాలపై ఆరా తీశారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులు నిర్వహిస్తున్న జీవనోపాధి వృత్తుల వివరాలు కావాలని వెలుగు ఏపీఎం సులోచనదేవికి సూచించారు. మండల కేంద్ర సమీపంలో రెండెకరాల భూమిని సేకరించాలని, మహిళా సంఘాల సభ్యుల జీవనోపాధి వృత్తులకు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. మండల సమాఖ్య భవనాన్ని నిర్మించాలని ఏపీఎం కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. గోకులాలకు వెండర్ విధానం అమలు చేయాలని ఏపీవో సుందరావు కోరారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి మాట్లాడుతూ భూముల రీ సర్వేలో వచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌ను మండల పరిషత్ అధికారులు, ఎంపీపీ షైమావతి, జెడ్పీటీసీ నర్సింహమూర్తి సత్కరించారు. అంతకు ముందు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి మంత్రి శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవం

దత్తిరాజేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): షికారుగంజి మోడల్ స్కూల్‌లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ దేవకివందన ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఆర్వోబీ పనులు త్వరితగతిన పూర్తి చేయండి


అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

చీపురుపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి పట్టణంలో ఆర్వోబీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు కోరారు. మంగళవారం ఆయన రాజాంలోని తన నివాసంలో ఈ పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అప్రోచ్ రోడ్డు కోసం స్థల సేకరణ తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం కళా మాట్లాడుతూ ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విశాఖ నుంచి పాలకొండ, రాజాం వైపు వెళ్లే ప్రయాణికులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదన్నారు. సంక్రాంతి సందర్భంగా ఈ రూటులో మరింత ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

1862 మంది ఓటర్లు

పార్వతీపురం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): శాసనమండలి ఎన్నికకు సంబంధించి జిల్లాలో 1,862 మంది ఓటర్లు ఉన్నట్టు జేసీ శోభిక వెల్లడించారు. ముసాయిదాపై అభ్యంతరాలను దాఖలు చేయడానికి డిసెంబరు 9వ తేదీ వరకు అవకాశం ఉన్నట్టు తెలిపారు. శాసన మండలి ఎన్నికకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ వాటిలో ఇప్పటివరకు 1,862 క్లయిమ్‌లు ఆమోదించగా, 274 తిరస్కరించినట్టు ఆమె తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులు ఇప్పటివరకు నమోదు చేసుకోకుంటే 9లోగా సమర్పించాలని ఆమె సూచించారు. డిసెంబరు 30న తుది ప్రచురణ ఉంటుందని జేసీ స్పష్టం చేశారు. మన్యం జిల్లాలో 15 పోలింగ్ స్టేషన్లు ప్రతిపాదించినట్టు తెలిపారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే తమ కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. సతివాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు మేలు జరిగే విధంగా తమ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చనమల్లు వెంకటరమణ, అంబళ్ల అప్పలనాయుడు, కరుమజ్జి గోవింద్, ఆల్లి రామచంద్ర, చందక రామునాయుడు, చింతపల్లి శ్రీనివాసరావు, పతివాడ గోవిందరావు, సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ రెడ్డి సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారి ఎం.పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలియజేయండి

భోగాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. అమటాంరాయవలస గ్రామం లో మంగళవారం పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. వితంతు పింఛన్లు మంజూరు కాలేదని, జోగిపేటలో కాలువలు లేవని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. ఈ క్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు వందనాల రమణ, నాయకులు పల్లంట్ల జగదీష్, కార్యదర్శి వసుంధరదేవి, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలకు అందించండి

శృంగవరపుకోట రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గౌరీపురంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రానికి రైతులు ధాన్యాన్ని అందించాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మంగళవారం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పంట అందించిన రెండు రోజుల్లో డబ్బులు పొందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఇందుకూరి రామరాజు, వ్యవసాయాధికారి రవీంద్ర పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నఎమ్మెల్సీ రఘురాజు

నష్టం కలిగించే విధానాలు విడనాడండి


నిరసనలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలకు నష్టం కలిగించే విధానాలను విడనాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాధ్ డిమాండ్ చేశారు, మంగళవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తమ విధానాల్లో మార్పు రాలేదని మోదీ ప్రభుత్వం రుజువు చేసుకుందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అవే విధానాలు అమలు చేస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతోందని ఆరోపించారు. కార్పొరేట్లకు రూ 19.28 లక్షల కోట్ల రుణమాఫీ, పన్ను రాయితీ ప్రోత్సాహాల పేరుతో ప్రజల ధనాన్ని దోచి పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్మ, రైతు సంఘ నాయకులు రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు రాములు, రెడ్డి నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు వెంటనే చెల్లించాలి

కళాశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, వాచ్‌మెన్ జీతాలు వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సంఘ నాయకులు సుధారాణి మాట్లాడుతూ ప్రభుత్వం సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు.

భోజన కార్మికుల నిరసన

మధ్యాహ్న భోజన పథకం కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నిత్యావసరాల ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం సమర్పించారు.

సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ కార్మికులు మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డీఆర్‌వోకి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ అధ్యక్షునిగా రాము

రాజాం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజాం తాలూకా ఏపీజీఈఏ నూతన అధ్యక్షునిగా అల్లు రాము, ఉపాధ్యక్షునిగా పి.వెంకటరవి మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. గతంలో ఎన్నికైన అధ్యక్షుడు కె.నాగరాజు, ఉపాధ్యక్షుడు భీమశంకరావు బదిలీపై వెళ్లిపోవడంతో ఆ స్థానంలో వీరిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తాలూకా కార్యదర్శి పి.గంగారాం. అసోసియేట్ ప్రెసిడెంట్ వి.శ్రీనివాసరావు, కోశాధికారి పి. పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు లక్ష్యాలను సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డీఎం రమణమూర్తి

రాజాం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బ్యాంకర్లు ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణమూర్తి ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జెఎంఎల్‌బీసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు లింకేజీ రుణాల విషయంలో జాప్యం చేయవద్దని ఆదేశించారు. వసూలు లక్ష్యం కూడా సకాలంలో పూర్తి చేయాలన్నారు. సకాలంలో చెల్లించిన గ్రూపులకు రుణాలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, ఏసీ చిరంజీవి, వివిధ విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్పులిచ్చాం.. చెల్లించి ఆదుకోండి

రాజాం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'రాజాంలోని మల్లికార్జున వీవర్స్ సొసైటీ అవసరాల కోసం అప్పులిచ్చాం.. ఆరేళ్లు గడుస్తున్నా అసలూ లేదు.. వడ్డీ లేదు.. అసలా మొత్తం ఎవరు తిరిగి చెల్లిస్తారో, చెల్లించరో తెలియని సందిగ్ధత నెలకొంది.. మాకు న్యాయం చేయాల'ంటూ పలువురు చేనేత నాయకులు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ముఖర్జీని కోరారు. రాజాం మల్లికార్జున వీవర్స్ సొసైటీని మంగళవారం సందర్శించిన ఆయనను చేనేత నాయకులు కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీ అభివృద్ధిలో భాగంగా మెటీరియల్ కొనుగోళ్లు, అమ్మకాలు, అభివృద్ధి అవసరాల కోసం ఆరేళ్ల క్రితం రూ.23 లక్షలు అప్పుగా ఇచ్చామని, ఆ మేరకు సంఘం నుంచి బాండ్లు ఇచ్చారని వారంతా స్పష్టం చేశారు. ఈ మొత్తాన్ని చెల్లించేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదని, నల్లా శ్రీనివాసరావు, నక్కిన మల్లిబాబు, బొమ్మన శ్రీనివాసరావు తదితరులు పర్సన్ ఇన్‌చార్జికి వివరించారు. దీనిపై స్పందించిన ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని లంకాపట్టణం ప్రాంతంలో గత 20 ఏళ్లుగా నడుపుతున్న ప్రార్థనా మందిరం స్థలాన్ని కొంత మంది వ్యక్తులు కబ్జాకు పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు, జిల్లా అధ్యక్షుడు కె.సోములు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎలియా, శివశంకరరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొని యువకుడి మృతి


చందు (ఫైల్)

తెర్లాం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెర్లాం గ్రామానికి చెందిన కాటకోను చందు(18) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చందు ద్విచక్ర వాహనంపై వస్తుండగా మలుపు వద్దకు వచ్చేసరికి బొబ్బిలి నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో చందు అక్కడికక్కడే మృతిచెందాడు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి పీహెచ్‌సీకి తరలించారు. మృతుడికి తల్లిదండ్రులు, చెల్లి ఉన్నారు. వీరు వ్యవసాయ కూలీలగా జీవనం సాగిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

రామభద్రపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ పట్టణం నుంచి కొమరాడ వెళ్తున్న బొలేరో వాహనాన్ని రామభద్రపురం నుంచి విజయనగరం వెళ్తున్న లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బొలేరో వాహనంలో ప్రయాణిస్తున్న కొమరాడ మండలం పూడేశు గ్రామానికి చెందిన హిమరిక పకీరు, కొండగొర్రి నరసన్న, ఉయ్యక గణపతి, కొండగొర్రి సుశీలు గాయపడ్డారు. వీరిని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఎస్ఐ వెలమల ప్రసాదరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా తయారీ కేంద్రంపై దాడి

విజయనగరం క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస మండలం రామలింగాపురం గ్రామ పరిధిలో మంగళవారం నాటుసారా తయారీ కేంద్రాలపై ఎన్‌ఫోర్సుమెంట్ వింగ్, టాస్క్‌ఫోర్సు, ఎక్సైజ్ ఎస్ఐ, సీఐలు దాడి చేశారు. ఈ దాడిలో 900 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సింహాద్రి, టాస్క్‌ఫోర్స్ సీఐ రామచంద్రకుమార్‌లు తెలిపారు.

ప్రభుత్వం బాధ్యతగా పని చేయడం లేదు: బొత్స


బాధితులకు చెక్కులు అందజేస్తున్న బొత్స

గుర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా పనిచేయడం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. గుర్ల గ్రామంలో డయేరియాతో మృతిచెందిన బాధిత కుటుంబాలకు మంగళవారం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తుల సమయంలో సంబంధిత మంత్రులు, నాయకులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పూర్తి సమాచారం తెలుసుకొని పని చేయాలన్నారు. ప్రతిపక్ష నాయకుల సలహాలు కూడా తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా 11 మంది డయేరియా బాధితులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ అప్పలనాయుడు, ఎంపీపీ ప్రతినిధి సన్యాసినాయుడు, సర్పంచ్ రవణమ్మ, ఎంపీటీసీ సీతారాములు పాల్గొన్నారు.

వైసీపీ నేతలతో భేటీ

గరివిడి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ గరివిడిలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం పార్టీ నాయకులతో భేటీ అయ్యారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే క్షమించేది లేదు

సీతంపేట రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విధుల పట్ల అలసత్వం వహిస్తే క్షమించేది లేదని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. కుసిమి, దోనుబాయి పీహెచ్‌సీలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో దోనుబాయి వైద్యాధికారి భాను ప్రతాప్, ఎల్‌టీ వసంతబాబు పీహెచ్‌సీలో లేరు. దీంతో వారిద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీ సమాచారం ఆమె వద్ద లేకపోవడంతో సూపర్‌వైజర్ గంగమ్మకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. కుసిమి పీహెచ్‌సీలో వైద్యాధికారులు, సిబ్బంది లేకపోవడం గమనించిన పీవో.. విధుల్లో లేని వారితో పాటు ఆలస్యంగా వచ్చిన వారికి కూడా మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మర్రిపాడు పీహెచ్‌సీని సందర్శించారు. రోగులకు సేవలు అందించాలని వైద్యాధికారి చరణ్‌కు సూచించారు.

పారదర్శకంగా అభివృద్ధి పనులు


మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తి నాణ్యతతో పాటు ప్రతి అంశం పారదర్శకంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్లో ఇంజనీరింగ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యకోనేరు, నీలాటి చెరువు, కోమటి చెరువులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుధ్య పరంగా ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువుల చుట్టూ నడకదారులను శుభ్రంగా ఉంచాలన్నారు. ఈసమావేశంలో ఎంఈటీ రాయల్‌బాబు, టెక్నికల్ అధికారి పట్నాల వెంకటేశ్వరరావు, డీఈలు ప్రసాద్, మణికుమార్, ఏఈలు పాల్గొన్నారు.

సురక్షిత నీరు అందించాలి

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 26: (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యమని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కొత్తఅగ్రహారంలోని వాటర్ ట్యాంకుని పరిశీలించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకును శుభ్రపరుస్తున్నారా? లేదా అన్నది గమనించాలన్నారు. పైపులైన్ల లీకులను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రతి రోజు నీటి నాణ్యతను పరిశీలించే క్లోరిన్ టెస్ట్‌లను చేస్తున్నారా? లేదా? అని, రికార్డు బుక్‌లు సక్రమంగా నిర్వహిస్తున్నారా? లేదా అన్నది పరిశీలించారు.

సాంకేతిక విద్యపై అవగాహన అవసరం

గజపతినగరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్.ఎస్.ఎ. రాష్ట్ర పరిశీలకులు ఆర్ .షైమేశ్వరరావు అన్నారు. మంగళవారం మరుపల్లి ఆదర్శ, కేజీబీవీ పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి.సాయి చక్రధర్, సమగ్ర శిక్ష ఏఎంఓలు ప్రసాదరావు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

» బీఆర్‌ అంబేడ్కర్‌కు నివాళి

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డా.బీఆర్‌ అంబేడ్కర్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్‌ చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, అధికారులు

(ఆంధ్రజ్యోతి బృందం)


బెలగాం/ పార్వతీపురం రూరల్‌: అంబేద్కర్‌ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర


బాడంగి: అంబేద్కర్‌ విగ్రహానికి పూలమాల వేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్‌ లక్ష్మణనాయుడు


బొబ్బిలి: కోర్టులో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీనియర్‌ సివిల్‌ న్యాయాధికారిణి అరుణశ్రీ


విజయనగరంటౌన్‌: అంబేద్కర్‌ విగ్రహానికి పూలమాల వేస్తున్న జడ్పీ చైర్మన్‌ శ్రీనివాసరావు


విజయనగరం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేద్కర్‌ చిత్రపటానికి సెల్యూట్‌ చేస్తున్న ఎస్పీ వకుల్‌ జిందాల్‌

దేశ సుస్థిర మనుగడకు ఆధారం..

పార్వతీపురం రూరల్‌, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ సుస్థిర మనుగడకు రాజ్యాంగ పీఠిక ఆధారమని కలెక్టర్‌ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ అన్నారు. మంగళవారం కలెక్టర్‌ కార్యాలయ సమావేశ మందిరంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా బీఆర్‌ అంబేడ్కర్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలబడి ఉందంటే దానికి కారణం రాజ్యాంగమేనని అన్నారు. అనంతరం రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. జేసీ శోభిక, డీఆర్‌వో ఎస్‌.తిరుపతి నాయుడు, కలెక్టర్‌ కార్యాలయం పాలన అధికారి సావిత్రి, విభాగాధిపతులు శ్రీరామ్మూర్తి, జయ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

● వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

కొమరాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య సమస్యలు తలెత్తకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు వైద్య సిబ్బందికి సూచించారు. కేఆర్‌బీ పురం పీహెచ్‌సీని ఆయన మంగళవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. ప్రసవాల గదిని, కాన్పుల రికార్డును పరిశీలించారు. ప్రతి నెల ఎన్ని కాన్పులు పీహెచ్‌సీలో చేపడుతున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. ల్యాబ్‌లో పరీక్షల పనితీరును గమనించారు. అనంతరం సిబ్బందితో సమీక్షించి ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సూచనలు చేశారు. సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆరోగ్య కార్యక్రమాలు సమగ్రంగా చేపట్టేలా పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. రాత్రి వేళల్లో సిబ్బంది పీహెచ్‌సీలో అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు.

కల్లెదుటే వరి కుప్పలు బుగ్గి

● ట్రాక్టర్‌ దగ్ధం ● లబోదిబోమన్న బాధితుడు


అగ్నికి ఆహుతవుతున్న వరి కుప్పలు, ట్రాక్టర్‌

బామిని, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధాన్యం నూర్పుస్తుండగా కళ్లెదుటే అగ్గిరేగి వరి కుప్పలు, ధాన్యం, ట్రాక్టర్‌ అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటన బూర్జిగూడ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. వరి కుప్పలు నూరుస్తున్న సమయంలో ట్రాక్టర్‌ ఇంజన్‌ సైలెన్సర్‌పై గడ్డి పడడంతో మంటలు చెలరేగాయి. అక్కడ పనిచేసేవారు మంటలను ఆర్పేందుకు అవకాశం లేకపోయింది. బిల్లరసింగి గ్రామానికి చెందిన అలక సుబ్బు, కొలకు చెందిన రెండున్నర ఎకరాల వరి నూర్పు ప్రారంభించారు. ఈ ప్రమాదం జరగడంతో లబోదిబోమంటున్నారు. సమాచారం తెలుసుకున్న బొద్దగూడ అగ్రికల్చర్‌ అసిస్టెంట్‌ ఎర్రన్న, వీఆర్వో కరుణాకర్‌ ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. ఈ ఘటనపై అధికారులకు సమాచారం అందిస్తామన్నారు. ఇప్పుడే నష్టం అంచనా వేయలేమని తెలిపారు.

కొట్లాటలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పాచిపెంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూ తగాదా విషయంలో జరిగిన కొట్లాటలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని పాంచాలి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. సాలూరుకు చెందిన మత్తి కోటేశ్వరరెడ్డికి పాంచాలి గ్రామం కొనుగోలు వలన రెవెన్యూ పరిధిలో పొలముంది. ఈ స్థలానికి ఆనుకుని పాంచాలి గ్రామానికి చెందిన సేనాపతి బంగార్రాజు స్థలం కూడా ఉంది. వీరిరువురి భూముల సంబంధించి సివిల్‌ తగాదాలు ఉన్నాయి. అయితే మంగళవారం ఉదయం గెడ్డ పైపు విషయంలో సదరు కోటేశ్వరరెడ్డితో బంగార్రాజు, అతని కుటుంబ సభ్యులు గొడవకు దిగారు. దీంతో బంగార్రాజు, కుటుంబ సభ్యులు కలిసి కర్రలు, రాళ్లతో కోటేశ్వరరెడ్డిపై దాడి చేశారు. ఈ దాడిలో కోటేశ్వరరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు పాచిపెంట ఎస్‌ఐ కె.వెంకటసురేష్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. గాయపడిన కోటేశ్వరరెడ్డిని సాలూరు ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి విజయనగరం ఆసుపత్రికి తరలించారు.

అప్‌లోడ్‌ తప్పనిసరి కాదు

బెలగాం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జీఎస్‌డబ్ల్యూ పోర్టల్‌లో గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బ్యాంకు ఖాతా, ఆధార్‌, పాన్‌ ఐడీలు అప్‌లోడ్‌ చేయడం తప్పనిసరి కాదని ఆయా రాష్ట్ర, జిల్లా అధికారులు తెలిపారని యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌.మురళీమోహనరావు చెప్పారు. ఈ మేరకు ఉపాధ్యాయులపై ఒత్తిడి ఆపాలని కోరుతూ యూటీఎఫ్‌ నాయకులతో కలిసి మంగళవారం ఐటీడీఏలో డీడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురళీ మోహనరావు మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ పాఠశాలల ఉపాధ్యాయులపై తమ వివరాలు అప్‌లోడ్‌ చేయాలని ఒత్తిడి తెస్తున్నారని, అప్‌లోడ్‌ చేయకపోతే చర్యలు తీసుకుంటామని భయపెడుతున్నారని అన్నారు. దీనిపై గిరిజన సంక్షేమ రాష్ట్ర, జిల్లా అధికారులకు వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయుల వివరాలు తప్పనిసరిగా కాదని తెలిపారని పేర్కొన్నారు. అప్‌లోడ్‌ చేయాలని ఎవరైనా బెదిరిస్తే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్‌ నాయకులు టి.రమేష్‌, కె.బాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

పార్వతీపురం టౌన్‌, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలం గుణద గ్రామంలో నిర్వహించిన వేర్వేరు దాడుల్లో 2,800 లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేయడంతో పాటు రెండు కేసులు నమోదు చేసినట్టు ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ ఇన్‌స్పెక్టర్‌ కె.సురేష్‌ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గుణదలో సారా తయారీపై దాడులు నిర్వహించామని, ఈ దాడుల్లో బెల్లపు ఊటలను ధ్వంసం చేయడంతోపాటు రెండు కేసులు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో పార్వతీపురం, సీతానగరం స్టేషన్ల సిబ్బందితో పాటు టాస్క్‌ఫోర్స్‌ తదితరులు పాల్గొన్నారన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం

మక్కువ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీపీ మర్రి పారమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. రహదారుల నిర్మాణంలో నాణ్యత లోపించిందని పెద్దపల్లి జడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు.. పంచాయతీరాజ్‌ ఏఈ రంజితకుమార్‌ను ప్రశ్నించారు. గోకులాల కోసం 400 దరఖాస్తులు చేస్తే 17 మందికి మాత్రమే మంజూరయ్యాయని ఉపాధి ఏపీవో ఎస్‌.ఈశ్వరమ్మను ప్రజా ప్రతినిధులు ప్రశ్నించారు. అలాగే విద్యుత్‌ శాఖ తీరుపై పలువురు మండిపడ్డారు. ఆహార్‌ ఎస్‌ నమోదులో ఆధార్‌ కేంద్రాలు లేక విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారని ఎంఈవో సత్యనారాయణ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్‌ షేక్‌ ఇబ్రహీం, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపకరణాల కోసం 92 మంది హాజరు

సాలూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైటీసీలో మంగళవారం నిర్వహించిన దివ్యాంగులు, వయోవృద్ధుల సహాయ ఉపకరణాల పరిశీలన కార్యక్రమానికి 92 మంది హాజరైనట్టు వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కె.కవిత, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు తెలిపారు. కలెక్టర్‌ ఎ.శ్యాంప్రసాద్‌ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. జోగిరాం గ్రామంలో ఎన్‌సీపీఐ సర్వే హౌస్‌హోల్డ్‌ మ్యాపింగ్‌ను ప్రగతితో పాటు పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్‌ వేణుగోపాలరావు, వైటీసీ మేనేజర్‌ విద్యాసాగర్‌ తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం దొంగ అరెస్టు

మక్కువ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొయ్యానపేట గ్రామానికి చెందిన కొయ్యాన మన్మథరావుకు చెందిన ధాన్యాన్ని దొంగిలించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మన్మథరావు ఈనెల 21న గ్రామంలో ధాన్యపు బస్తాలు వేసి ఉంచగా ఎవరో దొంగిలించారని ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు 16 బస్తాలు చోరీకి గురైనట్టు గుర్తించి, ఈనెల 24న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టగా మంగళవారం స్థానిక చర్చి సెంటర్‌ సమీపంలో సాలూరు మండలం రేగుపువలస గ్రామానికి చెందిన పోతల రామకృష్ణ ఆటోలో ధాన్యం తరలిస్తుండగా పట్టుబడ్డాడు. నిందితుడని అదుపులోకి తీసుకుని, ఆటోను, ధాన్యాన్ని సీజ్‌ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఎం.వెంకటరమణమూర్తి తెలిపారు. నిందితుడు ఈ విధంగా చోరీకి పాల్పడడం మూడోసారి అని ఆయన చెప్పారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వీరఘట్టం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్‌పురం గ్రామంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సబ్‌ కలెక్టర్‌ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఏడీఏ రత్నకుమారి, ఏవో సౌజన్య, తహసీల్దార్‌ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● గరుగుబిల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని ప్రభుత్వ విప్‌, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గొట్టివలసలో గరుగుబిల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం అమ్మకం చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తారని చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్‌, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ ఎ.మధుసూదనరావు, పార్టీ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


వీరఘట్టం: ధాన్యం ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


గరుగుబిల్లి: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

7న మెగా పేరెంట్స్‌ మీటింగ్‌

పార్వతీపురం రూరల్‌, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పాఠశాలల్లో డిసెంబరు 7న మెగా పేరెంట్స్‌ మీటింగ్‌ నిర్వహించాలని కలెక్టర్‌ శ్యామ్‌ ప్రసాద్‌ ఆదేశించారు. మండల విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలతో ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పేరెంట్స్‌ మీటింగ్‌కు తల్లిదండ్రులు అందరూ హాజరు కావాలన్నారు. అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ● బాల్య వివాహాల రహిత ఆంధ్ర ప్రదేశ్‌ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించాలని కలెక్టర్‌ ఆదేశించారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజలతో ప్రతిజ్ఞ చేయాలని అన్నారు.

కార్తీక వన సమారాధనలో మంత్రి


సహపంక్తి భోజనం చేస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బొడ్డవలస గ్రామ సమీపంలో మంగళవారం నిర్వహించిన కామాక్షి అమ్మవారి కార్తీక వన సమారాధనలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. ఈసందర్భంగా భక్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆమె వెంట టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయిలో రాణించాలి


జిల్లా జట్టుకు క్రికెట్‌ కిట్‌ను అందజేస్తున్న కలెక్టర్‌ శ్యామ్‌ప్రసాద్‌, జేసీ శోభిక

పార్వతీపురం రూరల్‌, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి దివ్యాంగుల క్రికెట్‌ పోటీల్లో పాల్గొంటున్న జిల్లా జట్టును కలెక్టర్‌ ఎ.శ్యామ్‌ప్రసాద్‌, జేసీ శోభిక ప్రశంసించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కలెక్టర్‌ కార్యాలయంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ తరఫున క్రికెట్‌ కిట్‌ను బహూకరించారు. డిసెంబరు 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ దివ్యాంగులు జట్టు పాల్గొంటుంది. ఈ పోటీల్లో విజేతగా నిలిచి జిల్లా ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో నిలపాలని కలెక్టర్‌, జేసీ ఆకాంక్షించారు.

త్వరితగతిన కొనుగోలు చేయండి

● కలెక్టర్‌ శ్యాంప్రసాద్‌

పార్వతీపురం రూరల్‌, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి కోతలు పూర్తయిన నేపథ్యంలో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే త్వరగా రైతుల నుంచి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ శ్యాంప్రసాద్‌ మండల అధికారులను సూచించారు. పెద్దాపుల్లింగ్‌ అయిన ధాన్యాన్ని ఆయా మిల్లులకు తరలించేలా చూడాలని కలెక్టర్‌ తెలిపారు. మంగళవారం కలెక్టర్‌ కార్యాలయ సమావేశ మందిరంలో తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. అల్పపీడనం కారణంగా జిల్లాలో ఈనెల 29 నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని, తుఫాను రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కల్లంలో ఉండే ధాన్యాన్ని వెంటనే బస్తాల్లో నింపుకొని ఇంటి వద్ద గానీ దగ్గరలో ఉన్న మిల్లు వద్ద గానీ భద్రపర్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీ శోభిక, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్‌, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌ శ్రీనివాసరావు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు ప్రోత్సాహకాలు

సీతంపేట రూరల్‌, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహకాలు అందిస్తోందని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. కుద్దపల్లి పంచాయతీ పరిధిలో 50 మంది గిరిజన రైతులకు ఆయన మంగళవారం టార్పలిన్లు, మినప, వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలన్నారు. రానున్న రోజుల్లో గిరిజన ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో రహదారి నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గీతాంజలి, సర్పంచ్‌ నరసమ్మ, ఏవో ఫి.శ్రీదేవి, టీడీపీ నాయకులు కర్నేన అప్పలనాయుడు, సవరతోట మొఖలింగం, హెచ్‌ పవన్‌, హెచ్‌ ప్రసాద్‌, చంద్రరావు, సూర్యం పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ విగ్రహానికి వినతి

బెలగాం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజన సంక్షేమ, గురుకుల పాఠశాల, కళాశాల ఔట్‌సోర్సింగ్‌ ఉపాధ్యాయులు, అధ్యాపకులు స్థానికంగా ఉన్న అంబేడ్కర్‌ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఏడు రోజులుగా ఐటీడీఏ ఎదుట రిలే దీక్ష చేస్తున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ నుంచి తమ పోస్టులను మినహాయించాలని కోరారు. ● ఔట్‌ సోర్సింగ్‌ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు అన్నారు. ఈ మేరకు దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.


అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

విప్‌కు సన్మానం

గరుగుబిల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో విప్‌గా బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా మండలానికి వచ్చిన కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి మంగళవారం స్థానిక టీడీపీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. మరుపెంట పంచాయతీ గొల్లవానివలసలో ఉత్సవంలా నిర్వహించి అనంతరం ఆమెను దుశ్శాలువాతో సన్మానించారు. అలాగే రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్‌ డైరెక్టర్‌గా ఎన్నికైన అక్కేన మధుసూదనరావుకు సన్మానించారు. పార్టీ ప్రతినిధులు కె.బలరామనాయుడు, ఎ.నారాయణరావు, జి.రామారావు, ఎస్‌.పోలినాయుడు, వి.వాసు, ఎన్‌.శంకరరావు, జి.శంకరరావు, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

రాయగడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేపోతే ఊరుకునేది లేదని ఆమ్‌ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు జనమేజయ స్వయి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం కార్యకర్తలతో కలిసి కలెక్టర్‌ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. హామీ మేరకు ఉచితంగా 300 యూనిట్లు విద్యుత్‌ అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి పేరిట రాసిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఒడిశా

రాయగడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కర్షక, కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐక్య కిషాన్‌ మోర్చా తరఫున జిల్లాలోని పలువురు రైతులు, కార్మికులు మంగళవారం నిరసన గళం వినిపించారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేరిట రాసిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్షకులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలి

సాలూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక రాజేశ్వరరావు పార్కు నుంచి మెయిన్‌రోడ్‌ మీదుగా మంత్రి సంధ్యారాణి ఇంటి వద్ద వరకు ర్యాలీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి, కార్మికుల సంక్షేమం కోసం పార్లమెంట్‌లో చట్టాలు చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. పురపాలక సంఘంలో కార్మికులకు బకాయిలు ఉన్న జీతాలు తక్షణం చెల్లించాలని కోరారు. అనంతరం మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

న్యూస్‌ బాక్స్‌

కిక్‌ బాక్సింగ్‌లో కోటిపాం విద్యార్థిని ప్రతిభ

కొమరాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కిక్‌ బాక్సింగ్‌ పోటీల్లో కోటిపాం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని ఎస్‌.శ్రీకృతిక ప్రతిభ చాటింది. ఈనెల 20, 21 తేదీల్లో విజయవాడలో జరిగిన అండర్‌-17 కిక్‌ బాక్సింగ్‌ పోటీల్లో కాంస్య పతకం సాధించినట్టు హెచ్‌ఎం జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థినిని హెచ్‌ఎం తోపాటు జిల్లా స్పోర్ట్స్‌ సెక్రటరీ, పాఠశాల పీఈటీ ఎం.ఉమారాణిశ్వర్మ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఆవుల అక్రమ రవాణా అడ్డగింత

కురుపాం రూరల్‌, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రవాణా చేస్తున్న పది ఆవులను స్వాధీనం చేసుకుని, కొత్తవలస లోని గోశాలకు తరలించామని ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు. మంగళవారం మొండెంఖల్‌ గూడ జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా ఎటువంటి పత్రాలు లేకుండా 10 ఆవులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నామని చెప్పారు. గుమ్మలక్ష్మీపురం నుంచి పార్వతీపురానికి ఆవులను తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. ఈ మేరకు కింతాడ రామారావు, నక్క ఈశ్వర్‌పై కేసు నమోదు చేసి, ఆవులను గోశాలకు తరలించామని చెప్పారు.

గిరిజన విద్యార్థినికి ఏవియేషన్‌ అవార్డు

సీతంపేట రూరల్‌, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రామానగరం గ్రామానికి చెందిన ఆరిక అనితకు ఏవియేషన్‌ అవార్డుకు ఎంపికయ్యింది. అనిత బీఎస్‌(ఇంగ్లీష్‌) చదువుతోంది. విమానయాన రంగంలో మహిళలను ప్రోత్సాహించాలనే లక్ష్యంతో శ్రీకాకుళంలో ఈనెల 18న నిర్వహించిన ఉమెన్‌ ఇన్‌ ఏవియేషన్‌ ఇండియా అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో పాల్గొని అనిత తన ప్రతిభను నిరూపించుకుంది. శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఈ పోటీల్లో ఆరుగురు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరికి ఢిల్లీలో మంగళవారం బహుమతులు అందజేశారు.

సదరం సేవలు ప్రారంభం

సీతంపేట రూరల్‌, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో మంగళవారం సదరం శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సూపరింటెండెంట్‌ శ్రీనివాసరావు, వైద్యాధికారులు రాజేష్‌, ఆర్థోపెడిక్‌ డీపీ శ్రీనివాసరావులు దివ్యాంగులను పరిశీలించి అర్హులను గుర్తించారు. అనుగుణ దివ్యాంగులను పరీక్షించి సిఫారసు చేసినట్టు ఆర్‌ఎంవో తెలిపారు. ఇకపై ప్రతి మంగళవారం, శుక్రవారం సీతంపేట ఏరియా ఆసుపత్రిలో సదరం శిబిరం నిర్వహిస్తామని తెలిపారు.

పరిసరాల శుభ్రతతో దోమల నివారణ

కురుపాం రూరల్‌, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మొండెంఖల్‌ పీహెచ్‌సీ పరిధిలోని పి.లేవిడి గ్రామాన్ని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ మంగళవారం పరిశీలించారు. గ్రామంలో జ్వర పీడితులు ఎక్కువ ఉన్న నేపథ్యంలో ఆయన పర్యటించారు. పరిసరాల పరిశుభ్రత వల్లే దోమల నివారణ సాధ్యం అన్నారు. మొండెంఖల్‌ పీహెచ్‌సీలోని రికార్డులను తనిఖీ చేశారు.